అన్నదాతలను వణికిస్తున్న మిచాంగ్

- సూర్యలంక తీరంలో పెరిగిన అలల ఉధృతి
- కోతకు సిద్ధమైన వరిపైర్లు
- తీరప్రాంత గ్రామాల్లో ప్రారంభమైన వర్షం
- ఆందోళనలో అన్నదాతలు


వెస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో హడావుడిగా కట్టివేత వేస్తున్న రైతులు


సూర్యలంక సముద్రతీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు


చుండూరుపల్లిలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

బాపట్ల టౌన్: రేయింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన వరిపైర్లు చేతికందే తరుణంలో అనూహ్య రీతిలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ ఎక్కడ ముంచుతుందోనని రైతులు కలవరపడుతున్నారు. నెల రోజుల క్రితం వరకు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ అష్టకష్టాలు పడి పంటలను సాగుచేసిన రైతులు ఈ ఏడాది ఆశించిన మేర పైరు ఆశాజనకంగా ఉండి, మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులను వాతావరణ మార్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిచాంగ్ తుఫాన్ నెల్లూరు–మచిలీపట్నం మధ్యలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో శనివారం సాయంత్రం నుంచి తీరప్రాంత గ్రామాల్లో ఈదురు గాలులు ప్రారంభం కావడం, మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో చిరుజల్లులు ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్షణక్షణం..భయంభయం

మండలంలోని రైతుల పరిస్థితి ముందు నుయ్యి... వెనక గొయ్యి అన్నచందంగా మారింది. తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొనే సమయంలో మొహం చాటేసిన వరుణుడు...తీరా పంటలు చేతికొచ్చే తరుణంలో రైతుల ఆశలపై నీళ్ల చల్లే ప్రయత్నం చేయడంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎక్కడ చేతికందకుండా పోతుందోనన్న భయంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికే కోతలు కోసి ఓదెలపై ఉంచిన పైర్లకు ఇది పెనుముప్పుగా మారే ప్రమాదం ఉంది.

మండలంలోని పరిస్థితి ఇదీ...

బాపట్ల మండలంలోని ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం, వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం, చుండూరుపల్లి, ఈతేరు, గుడిపూడి, భర్తిపూడి, నేరుడుపల్లి, అప్పికట్ల, మర్రిపూడి, ఈస్ట్ బాపట్ల, వల్లువారిపాలెం గ్రామాల్లో పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. పిన్నిబోయినవారిపాలెం ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాల మేర కోతలు కోశారు. వాటిల్లో కేవలం 25 ఎకరాలు మాత్రమే కట్టివేతలు వేశారు. మిగిలిన 130 ఎకరాల మేర ఓదెలపై ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో వరిపైర్లు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడితే పైర్లు నేలవాలిపోతాయని, ఓదెలపై ఉన్న పైర్లు మొలకలు వస్తాయని అన్నదాతలు అవేదన చెందుతున్నారు. వీటితోపాటు మండలంలోని ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కొత్తమద్దిబోయినవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, పాండురంగాపురం, దరివాదకొత్తపాలెం, పోతురాజు కొత్తపాలెం, బసివిరెడ్డిపాలెం గ్రామాల్లో వరిపైర్లు ప్రస్తుతం ఈనే దశలో ఉన్నాయి. ఈ దశలో వర్షం పడటం వలన మానుకాయ పడటంతోపాటు, గింజలు తాలుకంకులుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీరం అప్రమత్తం

- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- తీరంలో ప్రత్యేక శిక్షణ పొందిన బృందాలతో గస్తీ
- పునరావాస కేంద్రాలను గుర్తించాలి
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుపానుగా మారనున్న నేపథ్యంలో తీరప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాపట్లకు ఈశాన్య దిశలో 710 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర వాయుగుండం డిసెంబర్ 3 వ తేదీకి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంటుందన్నారు. దీని ప్రభావం బాపట్ల జిల్లాపై ఎక్కువగా చూపే అవకాశం ఉన్నందున సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా సురక్షిత ప్రాంతాలు, తుఫాన్ షెల్టర్‌కు వెళ్లాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. సముద్ర తీర బీచ్‌ల వద్దకు పర్యాటకులు ఎవరూ రావద్దన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన ప్రాంతాలలో సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నామన్నారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి ప్రయాణాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయడానికి సంబంధిత సామగ్రి, వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించామన్నారు. అనంతరం జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారితో మాట్లాడుతూ నదీ పరీవాహక ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. ప్రయాణించేందుకు అనువు కాని మార్గాల్లో, నీట మునిగిన రహదారుల వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేసి ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైఫ్ జాకెట్స్, రోప్స్‌లతో పోలీసులు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితులలో తక్షణ సహాయం కోసం డయల్ 100, 112 పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 83338 13228, స్థానిక పోలీసు అధికారులకు సమాచారమివ్వాలన్నారు.

విద్యుత్ అత్యవసర సేవలకు కాల్‌సెంటర్లు ఏర్పాటు

రేపల్లెరూరల్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులకు అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ తెనాలి ఈఈ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, విద్యుత్ తీగలు తెగిపడినా వినియోగదారులు సంబంధిత కాల్‌సెంటర్‌లకు సమాచారం అందించాలన్నారు. 24 గంటలు కాల్‌సెంటర్‌లు పనిచేస్తాయన్నారు. తెనాలిలో 94408 17535, రేపల్లెలో 94906 15536, గంగడిపాలెంలో 94906 15538, లంకెవానిదిబ్బలో 85006 26842 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. నీటిలో మునిగి ఉన్న మోటార్లను, తడిసిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని హెచ్చరించారు.

హడావుడిగా వరికుప్పలు



వరహాపురం(వేమూరు): మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల రైతులు హడావుడిగా వరి కుప్పలు వేస్తున్నారు. కొంతమంది రైతులు హార్వెస్ట్ మిషన్ ద్వారా వరి నూర్పిళ్లు చేస్తున్నారు. కోతలు కోసినవి దెబ్బతినకుండా అధిక రేట్లకు కూలీ ఇచ్చి మరీ వరి కుప్పలు వేస్తున్నారు.

మిచాంగ్ నేపథ్యంలో నిరంతరం అప్రమత్తం

- తుపానును సమర్థంగా ఎదుర్కోవాలి
- అధికారులు, సిబ్బందికి తహసీల్దార్ మల్లికార్జునరావు ఆదేశం


వివిధ శాఖల అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లెరూరల్: తీరానికి మిచాంగ్ తుపాను ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రజలను, ముఖ్యంగా రైతులను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ మల్లికార్జునరావు ఆదేశించారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రేపల్లె తీరప్రాంతంలో సైతం 4, 5, 6 తేదీలలో వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు వీసేందుకు అవకాశం ఉందన్నారు. వర్షం, ఈదురుగాలులు తీవ్రంగా ఉంటే పాఠశాలలకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల లోని ప్రజలు సముద్రం, నదులలో వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మండలంలో అందుబాటులో ఉన్న తుపాను భవనాలను పునరావాస కేంద్రాలుగా సిద్ధంగా ఉంచాలన్నారు. తుపాను భవనాలు లేని గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా చేయాలన్నారు. పునరావాస కేంద్రాలలో ఆహార పదార్థాలు సైతం సిద్ధం చేసి ఉంచాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులకు సెలవులు లేవని, సెలవుల్లో ఉన్న అధికారులు సైతం సెలవులను రద్దు చేసుకుని విధులకు హాజరుకావాలన్నారు. కృష్ణానది తీరప్రాంతంలో గాని, దిగువ గ్రామాలైన సముద్ర తీరప్రాంతాలలో గాని కచ్చా గృహాలలో ఉండే ప్రజలను అప్రమత్తం చేసి పక్కా ఇళ్లలోకి గాని, పునరావాస కేంద్రాలకు గాని తరలించాలని చెప్పారు. ఇప్పటికే సాగుభూమిలో పంట కోతలు కోసి ఉంటే రైతులు ఆ పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే విధంగా వ్యవసాయ అధికారులు అప్రమత్తం చేయాలని చెప్పారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మండలస్థాయి అధికారులు కలిసికట్టుగా పనిచేసి తుపాను ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పర్యవేక్షిస్తూ ఉండాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవో సురేష్, ఎస్‌ఐ హరిబాబు, వ్యవసాయశాఖ ఏడీఏ అక్తర్ హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు వేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న రాహుల్ మాలిక్, పక్కన జేసీ శ్రీధర్, అధికారులు

బాపట్లఅర్బన్: నిరుపేదలంతా అభివృద్ధి దిశగా అడుగులు వేయడమే కేంద్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రాష్ట్ర నోడల్ అధికారి రాహుల్ మాలిక్ చెప్పారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం గ్రామంలో సంచార వాహనం శనివారం పర్యటించింది. సంచార వాహనానికి అధికారులంతా ఘనంగా ఆహ్వానం పలికారు. భారత దేశం అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉంటామంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. శిశువులకు అన్నప్రాశన చేశారు. గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు లబ్ధిదారులకు అందించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, పథకాల అమలు తీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. వివిధ పథకాలలో లబ్ధి పొందిన లబ్ధిదారులంతా తమ అనుభవాలను పంచుకున్నారు. జాతీయస్థాయి హాకీ క్రీడలో మూడో స్థానం సాధించిన ఇరువురు క్రీడాకారులు, జాతీయ మెరిట్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన సుప్రజ కు శాలువలు కప్పి సన్మానించారు. గ్రామంలో నూరు శాతం పారిశుధ్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లాప్ మిత్రలను సత్కరించారు.


పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. సంకల్ప యాత్ర కొనసాగే గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ కారణాలతో మిగిలిపోయిన అర్హులందరికీ పథకాలు అందించాలని సూచించారు. 17 కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల కోసం అమలు జరుగుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.రవీందర్, డీపీఓ డి.రాంబాబు, డీఆర్డీఏ పీడీ బి.అర్జున్ రావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

నిజాంపట్నం: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టి ఏబీసీడీ వర్గీకరణ చేసి బీజేపీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ ఏటుకూరి విజయకుమార్ మాదిగ తెలిపారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యాచరణ, జిల్లా, మండల, గ్రామ కమిటీల నిర్మాణంలో భాగంగా నిజాంపట్నం మండలంలోని పలు కాలనీల్లో సమావేశాలు నిర్వహించారు. సమావేశానికి నియోజకవర్గ అధ్యక్షుడు జోలకంటి బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కన్వీనర్ కొమరాల శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్‌లు దున్నా రాబర్ట్, ఆలూరి నారాయణ, నియోజకవర్గ కన్వీనర్ విల్సన్, మండల కన్వీనర్ దున్నా ప్రదీప్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో టాటా కన్సల్‌టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆధ్వర్యంలో ప్లాస్టిక్ భూతం నుంచి భూగోళంను రక్షించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు శనివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో షేక్ నాజ్మిన్, పి. గీతిక, జి.అవినాష్, జూనియర్స్ విభాగంలో జి.సుప్రియ, సయ్యద్ అర్షియా, జీవీ పావని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి రమేష్, హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చందోలును నగర పంచాయతీగా చేస్తాం

- స్పష్టం చేసిన ఎమ్మెల్యే కోన
- రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి


పిట్టలవానిపాలెం: చందోలు గ్రామాన్ని నగర పంచాయతీగా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వెల్లడించారు. గ్రామంలో రూ.3 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ గ్రామస్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నిరంతర విద్యుత్ సరఫరా విషయంలో ఏర్పాట్లు చేశామన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తనకు 2800 ఓట్ల మెజార్టీని అందించిన చందోలు గ్రామాన్ని తాను ఎన్నటికీ మరువలేనన్నారు. చందోలు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. చందోలు గ్రామస్తులు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన ఇంటి తలుపు తట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు గౌరీదేవి, విజయకుమారి, మునీర్, ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్విని రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ చేబ్రోలు వీరయ్య, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు మండే విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి ఆరోపణలు అవాస్తవం

భట్టిప్రోలు: మండలంలో ఉపాధి హామీ పనుల్లో రూ.60 లక్షలు అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమనియడంలో వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో శనివారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పనులన్నీ ఎస్‌ఆర్‌ఈజీఎస్ పర్యవేక్షణలో జరిగాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఆయా శాఖల అనుమతులు లేకుండా పనులు జరిగిన విషయాన్ని టీడీపీ నాయకులు మరిచారన్నారు. డ్రైనేజీ పనుల కింద 2,499, ఇరిగేషన్ పనుల కింద 19,349 పని దినాలు కూలీలకు కల్పించారని, ఇందులో ఎటువంటి అక్రమాలకు తావు లేదన్నారు. ప్రతి నయా పైసా కూలీల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. టీడీపీ హయాంలో ఐదేళ్ల కాలంలో రూ.2.11 కోట్లు పనులు జరగగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూలీలకు 1.51 లక్షల పని దినాలు కల్పించి రూ.3.84 కోట్లు పనులు జరిగాయని తెలిపారు. వాస్తవాలను మరుగున బెట్టి ప్రజలను పక్కదారి పట్టించే విధానాన్ని టీడీపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నేతలు కుందేటి రమేష్, కుక్కల భూషణరావు, దారా చెన్నయ్య, అరుణ్‌శాస్త్రి, వేల్పూరి చిన్నారి, తలకొల యలమంద, మోర్ల కోటేశ్వరరావు, గాడల్లి దాసు, శిరందాసు మనోహర్, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, బుల్లెబ్బాయి, కె. ప్రసాద్, దాసరి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చర్యలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం


వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్లఅర్బన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రక్తహీనత రహిత జిల్లాగా బాపట్లను తీసుకురావాలని కోరారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు బాపట్ల జిల్లాలో ప్రత్యేక యాప్ రూపొందించామని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కార్యకర్తల పర్యవేక్షణ పెరగాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, కౌమార దశ బాలికలలో రక్తహీనత, పోషణ లోపం నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. హీమోగ్లోబిన్ శాతం పది నుంచి 14 గ్రాముల వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా మాత, శిశు మరణాలు అరికట్టవచ్చన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం లక్ష్యం అన్నారు. చిన్నారుల ఎదుగుదల చక్కగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా విద్య, వైద్యం, పోషకాహారం ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. అర్హులైన ప్రజలందరికీ లబ్ధి చేకూరినప్పుడే సుస్థిరాభివృద్ధి సాధించగలమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోగలమని వివరించారు. ఉచితంగా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.విజయమ్మ, డీఈవో పీవీ రామారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమ, మండల స్థాయిలో ఎంపీడీవోలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తికమాసం ప్రత్యేక పూజలు

బాపట్లఅర్బన్: బాపట్ల ఎస్‌ఎన్‌పీ అగ్రహారం శ్రీ గంగాపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తికమాసం, శనివారం, ప్రాతఃకాల విశేష అభిషేకం అనంతరం ఆలయ అర్చకుడు కొల్లిపర వెంకట శివవర ప్రసాద్ విశేష అలంకరణలో ఘననీలాంబరునిగా స్వామివారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. ఆలయ ధర్మకర్త హరినారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా కబడ్డీ జట్టుకు అభినందన


కబడ్డీ జట్టు క్రీడాకారులను అభినందిస్తున్న మంతెన సుబ్బరాజు, బి.రాజశ్రీ తదితరులు

బాపట్లఅర్బన్: బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా కబడ్డీ జట్టుకు అభినందన సభ నిర్వహించారు. ఇటీవల కర్నూలు జిల్లా డోన్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీలలో ఉమ్మడి గుంటూరు మహిళల కబడ్డీ జట్టు తృతీయ స్థానం సాధించింది. జట్టులో పాల్గొన్న పి.వరలక్ష్మి, ఎం.త్రివేణి పంజాబ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర మహిళా జట్టుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో విజేతలను సన్మానించి వారికి మెడల్స్, క్యాష్ ప్రైజ్ అందజేశారు. ఆంధ్ర అసోసియేషన్ ఏపీ ట్రెజరర్, ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రెటరీ మంతెన సుబ్బరాజు, హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజశ్రీ, పీడీలు కత్తి శ్రీనివాసరావు, బి.రాధాకృష్ణ, తిరుమల శెట్టి సాంబశివరావు, ఎం.సాయికుమార్(కోచ్) పూల నాగులు, కోచ్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామ సచివాలయం ప్రారంభం



చంపాడు(వేమూరు): పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలం చంపాడు గ్రామంలో శనివారం గ్రామ సచివాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంపాడు గ్రామంలో సైడ్ డ్రయినేజ్ రూ.60 లక్షలతో పూర్తి చేశామన్నారు. సిమెంట్ రోడ్లు కూడా వేశామన్నారు. గ్రామ సచివాలయం రూ.42 లక్షలతో నిర్మించామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా మేలు జరుగుతోందని, తిరిగి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ గాజుల హేమలత, గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, వైస్ ఎంపీపీ షేక్ బాజీ, ఎంపీటీసీ ఈపూరు కుసుమ, దాది సుబ్బారావు, గాజుల మోహన్, దున్నా మేరీసుబాబు, కోఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరరావు, బొల్లిముత ఏడుకొండలు, గ్రామ సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలోని 228 పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆదివారం కూడా స్పెషల్ క్యాంపెయిన్ జరుగుతోందని, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బలిజేపల్లిలో సెమీ క్రిస్మస్

బలిజేపల్లి(వేమూరు): ఏసు క్రీస్తు పాపులను రక్షించేందుకు పుట్టాడని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేం రాజు అన్నారు. వేమూరు మండలంలోని వేమూరు, బలిజేపల్లి గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్టార్ ప్రారంభించారు. పాస్టర్లు కోపల్లె యోనా, డేవిడ్ రాజ్, నాగయ్య, యూత్ యువకులు పచ్చిగోళ్ల అనిల్ మూలాప్రారు రవి, ఎలిచర్ల సురేస్ కూచిపూడి వినయ్, త్రిపతి సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా సురేష్

బాపట్లఅర్బన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు నివాసంలో శనివారం బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా కర్రెద్దుల సురేష్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి దేవరపల్లి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్రెద్దుల సురేష్‌ను ఘనంగా సత్కరించారు.

తుంగభద్ర వంతెనపై ఇరుక్కుపోయిన లారీ

చుండూరు(వేమూరు): చుండూరు గ్రామంలోని తుంగభద్ర వంతెనపై లారీ ఇరుక్కు పోవడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పంచాయతీ అధికారులు లారీని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

సిద్ధమైన పంటను యంత్రాలతో కోయించుకోవాలి

రేపల్లె రూరల్: కోతకు సిద్ధమైన పంటను యంత్రాలతో కోత కోయించి రైతులు భద్రపరుచుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ చెప్పారు. తుపాను ప్రభావంతో రైతులను అప్రమత్తం చేసేందుకు శనివారం ఆయన పలు గ్రామాలలో పర్యటించి రైతులకు పలు సూచనలు జారీ చేశారు. తుపాను ప్రభావం పోయిన అనంతరం కోత కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవచ్చన్నారు. ఇప్పటికే వరిపంట కోత కోసి పనల రూపంలో ఉంటే కట్టలు కట్టి కుప్పలు వేసుకుని రక్షణగా టార్పాలిన్ పట్టాలు కప్పుకోవాలన్నారు. సాగు భూమిలో ఇంకా కోతలు కోయించని పైరును కూలీలతో కోతలు కోయించవద్దన్నారు. పంట పొలాలలో వర్షపు నీరు నిలవకుండా గట్లకు గండ్లు కొట్టాలని చెప్పారు. సమీపంలోని డ్రెయిన్‌లలో నీరు పారుదల అయ్యేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏవో బుష్, ఏఈవోలు ప్రభాకర్,సహాయకులు ఆషా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



రేపల్లెరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ మల్లికార్జునరావు ఆదేశించారు. ఓటర్ల జాబితాలపై మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌ను శనివారం ఆయన పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను గుర్తించి ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలన్నారు. ఇప్పటికే ప్రచురించిన జాబితాలో అభ్యంతరాలపై విచారణ చేయాలన్నారు. డబుల్ ఎంట్రీలను తొలగిస్తూ మృతుల ఓటర్లను గుర్తించి తమకు నివేదించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఊలుపాలెం, నల్లూరుపాలెం, అరవపల్లి తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్వోలకు సూచనలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com